గుదిబండగా గుర్రపుడెక్క

- పెదఎడ్లగాడి వంతెన వద్ద మేటలు
- ఏటా సమస్యగా గుర్రపుడెక్క తొలగింపు
- నీట మునుగుతున్న రహదారులు
- 8 అడుగులకు చేరిన పెదఎడ్లగాడి వంతెన నీటిమట్టం


ఎదఎడ్లగాడి వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్క


మండవల్లి - మూడుతాళ్లపాడు రహదారిపైకి చేరిన వర్షం నీరు

కైకలూరు: గుర్రపుడెక్క రైతుల పాలిట వదలని పీడకలగా మారింది. భారీ వర్షాలు కురిసినప్పుడల్లా పెదఎడ్లగాడి వంతెన వద్ద గుర్రపుడెక్క గుదిబండగా మారుతోంది. కొద్ది రోజులుగా విస్తారంగా కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వరద నీరు కొల్లేరుకు చేరుతోంది. కైకలూరు నియోజకవర్గం, మండవల్లి మండలం, పెదఎడ్లగాడి వంతెన వద్ద 56 ఖానాల్లో ప్రస్తుతం గుర్రపుడెక్క మేటలు వేసి ఉంది. వంతెన నుంచి దిగువకు వచ్చే నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి చేరుతుంది. వరదల సమయంలో ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి 67 డ్రెయిన్ల ద్వారా 1.10 లక్షల క్యూసెక్కుల నీరు కొల్లేరుకు వస్తుంది. గుర్రపుడెక్క, ఆక్రమిత చెరువుల కారణంగా కేవలం 12 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే దిగువకు వెళుతుంది.

స్తంభించిన రాకపోకలు

బంగాళాఖాతంలో అల్పపీడనం వల్ల కురిసిన వర్షాలకు ఎగువ నుంచి భారీగా వర్షపు నీరు కొల్లేరుకు చేరుతోంది. కొల్లేరు సరస్సుకు 9 లక్షల ఎకరాల మెట్ట, మూడున్నర లక్షల ఎకరాల మాగాణి, 67 వివిధ డ్రెయిన్ల నుంచి నీరు చేరుతోంది. వర్షాకాలంలో కొల్లేరు 250 చదరపు కిలోమీటర్లు విస్తరిస్తోంది. ప్రస్తుతం పెదఎడ్లగాడి వద్ద 8 అడుగుల నీటిమట్టం నమోదైంది. వంతెన వద్ద గుర్రపుడెక్క నీటి ప్రవాహానికి అడ్డు రావడంతో మండవల్లి నుంచి మూడుతాళ్లపాడు వెళ్లే రహదారిలో ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద రహదారిపై రెండు గండ్లు, సిద్ధాంతం - పెదఎడ్లగాడి రహదారి నీట మునిగింది. దీంతో ఆ రహదారిలో రాకపోకలు స్తంభించాయి. డ్రెయిన్లలో నీరు పెరగడంతో ఏలూరు జిల్లా కోమటిలంక గ్రామం నుంచి ఆటపాక వచ్చే నాగరాజు కోడు ఉధృతంగా ప్రవహిస్తోంది.

గుర్రపుడెక్కతోనే అసలు సమస్య

గుర్రపుడెక్క ఫాంటెడెరియా క్రాసిప్స్ అనే జాతికి చెందిన మొక్క. ఇది నీటిలో దట్టంగా పెరగడంతో సూర్యరశ్మి కిందకు చేరకపోవడంతో చేపలు, కొన్ని జీవరాశులు మృత్యువాతపడుతున్నాయి. రసాయనాలు పిచికారీ చేసినా వీటి పెరుగుదల ఆగడం లేదు. ప్రధానంగా ఎగువ ప్రాంతాల నుంచి గుర్రపుడెక్క ఏటా దిగువకు కొట్టుకు వస్తోంది. మనుషులతో తొలగించడం కష్టతరమవుతోంది. పెదఎడ్లగాడి వంతెన వద్ద యంత్రాలను ఉపయోగిస్తే వంతెన దెబ్బతింటోందని ఆర్‌అండ్‌బీశాఖ అధికారులు అనుమతించడం లేదు. నియోజకవర్గంలో పలు డ్రెయిన్లలో సైతం డెక్క పేరుకుపోవడంతో పంట పొలాలు మునుగుతున్నాయి.

రూ.412 కోట్లతో ఉప్పుటేరు ఆధునీకీకరణ

కొల్లేరు సరస్సు పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. సరస్సు నుంచి మురుగునీటిని సముద్రంలో కలిపే ఉప్పుటేరు ఆధునికీకరణకు మూడు ప్రాంతాల్లో క్రాస్ రెగ్యులేటర్ కమ్ బ్రిడ్జి కమ్ లాక్‌లను నిర్మించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం దుంపగడప వద్ద ఉప్పుటేరుపై(10.56 కిలోమీటరు వద్ద) రెగ్యులేటర్ నిర్మాణానికి రూ.87 కోట్లు, ఇదే జిల్లా మొగల్తూరు మండలం పడతడక వద్ద ఉప్పుటేరుపై(1.40 కిలోమీటరు వద్ద) రెగ్యులేటర్ కమ్ బ్రిడ్జి కమ్ లాక్ నిర్మాణానికి రూ.136.60 కోట్లు మంజూరు చేసింది. ఇదే మండలం మొళ్లపర్రు వద్ద ఉప్పుటేరుపై(57.95 కిలోమీటరు వద్ద) రెగ్యులేటర్ కమ్ బ్రిడ్జి కమ్ లాక్ నిర్మాణానికి రూ.188.40 కోట్లు మంజూరు చేసింది. అలాగే కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలం నిడమర్రు వద్ద పెదలంక మేజర్ డ్రెయిన్‌పై(3.25 కిలోమీటరు వద్ద) అవుట్‌ఫాల్ స్లూయిజ్, డబుల్ లేన్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.40 కోట్లను కేటాయించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో కొన్ని పనులకు శంకుస్థాపన చేశారు.

ముమ్మరంగా గుర్రపుడెక్క తొలగింపు

పెదఎడ్లగాడి వంతెన వద్ద గుర్రపుడెక్క తొలగింపునకు రూ.8.5 లక్షలు శాఖపరంగా కేటాయించారు. రెండు రోజుల్లో మనుషులతో వంతెన వద్ద తొలగింపు పనులు చేపడతాం. పెదఎడ్లగాడి వంతెన వద్ద ప్రస్తుతానికి 8 అడుగులు నీటి మట్టం ఉంది. ఇది 12 అడుగులకు చేరితే ప్రమాదం. కైకలూరు నియోజకవర్గంలో పలు డ్రెయిన్లలో గుర్రపుడెక్కను పొక్లెయిన్లతో తొలగిస్తున్నాం.

– ఇందిరా, డ్రెయినేజీ శాఖ జేఈఈ, కైకలూరు

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

కైకలూరు: శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని సీఐ కృష్ణకుమార్‌కు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు సూచించారు. కైకలూరు రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన బి.కృష్ణకుమార్ శనివారం ఎమ్మెల్యే డీఎన్నార్‌ను ఆయన ఇంటి వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ మండలాలపై వారు చర్చించారు. కృష్ణకుమార్ భీమవరం టూటౌన్ సీఐగా పనిచేస్తూ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే డీఎన్నార్‌తో నూతన సీఐ కృష్ణకుమార్

సర్కారు కాల్వ వంతెనపై భారీ వాహనాల నిషేధం



కైకలూరు: భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి కొల్లేరుకు చేరుతున్న నీటితో పందిరిపల్లిగూడెం సర్కారు కాల్వ వద్ద నీటి ఒరవడి శనివారం పెరిగింది. ఇటీవల నిర్మించిన నూతన వారధి నిర్మాణం ర్యాంప్‌పై నుంచి నీరు ఇనుప వంతెన దాటి వెళుతోంది. దీంతో రూరల్ ఎస్ఐ జ్యోతిబాస్ వంతెన వద్ద పికెట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇనుప వంతెనపై కేవలం బాటసారులు, ద్విచక్ర వాహనదారులు మాత్రమే ప్రయాణించాలన్నారు. భారీ వాహనాలను నిషేధించామన్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానానికి ఆదివారం వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

గుడివాడటౌన్(నందివాడ): ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని ఆర్డీఓ పి.పద్మావతి తెలిపారు. నందివాడ మండలంలోని ఒద్దులమెరక, పుట్టగుంట, చినలింగాల, పెదలింగాల, తమిరిశ తదితర గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి శనివారం ఆమె పర్యటించారు. నీట మునిగిన ప్రాంతాలను పరిశీలించి స్థానిక రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తామని, ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకుండా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.భవన్నారాయణ, ఎంపీపీ పెయ్యల ఆదాం, వైఎస్సార్ సీపీ నాయకుడు కందుల నాగరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి, అధికారులు

త్యాగానికి ప్రతీక మొహర్రం

తోట్లవల్లూరు: త్యాగానికి ప్రతీకైన మొహర్రంను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ఐలూరులో మొహర్రంను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి పీర్ల పంజా వద్ద నిప్పులగుండం నిర్వహించారు. శనివారం అమరుల త్యాగాలను స్మరించుకుంటూ యువకులు చెస్ట్‌బీటింగ్ నిర్వహించి రక్తం చిందించారు. సాయంత్రం గ్రామంలో పీర్ల ఊరేగింపును నిర్వహించారు. ఆయా కార్యక్రమాలను ముస్లిం పెద్దలు షేక్ భాషా, జబ్బార్, హసన్, పఠాన్ అమీర్‌ఖాన్ పర్యవేక్షించారు.

అమరవీరులకు నివాళి

పమిడిముక్కల: మొహర్రం మాసం పదో రోజు సందర్భంగా మండలంలోని అలీనఖీపాలెంలో రెండు మసీదుల్లో చెస్ట్‌బీటింగ్ చేశారు. రక్తం చిందించి కర్బలా అమరవీరులకు నివాళులర్పించారు. యా హుస్సేన్.. యా అబ్బాస్ అంటూ బ్లేడులు, జింజర్లతో ఒంటిపై గాట్లు పెట్టుకొని రక్తం చిందించారు. చిన్న, పెద్దా తేడాలేకుండా అందరూ చెస్ట్ బీటింగ్‌లో పాల్గొన్నారు. గ్రామంలో పీర్లను ఊరేగించారు. రెండు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ బలిదానానికి ప్రతీక మొహర్రం. ప్రాణత్యాగం చేసిన కర్బలా అమరవీరులను స్మరించుకోవడమే మొహర్రం. గదీర్ సొసైటీలో మత గురువు సయ్యద్ నవీద్ అబిది ప్రత్యేక ప్రార్థనలు జరిపించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ షా జవాద్ అలీ, కార్యదర్శి హుస్సేన్ అలీ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ గ్రామంలోని రెండు మసీదుల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని అల్లినగరం, ఉనికిలి, సింగనపూడి గ్రామాల్లో శనివారం మొహర్రంను నిర్వహించారు. అల్లినగరంలో ఆస్థాన దగ్గర మహిళలు ఖురాన్ పఠించి, సాయంత్రం వరకు ఉపవాసం చేశారు. మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా, అబ్దుల్ కరీం, రకీబా, ఇబ్రహింఖాన్, గద్దర్ పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడటౌన్: దుర్మార్గపు రాచరిక పరిపాలనకు వ్యతిరేకంగా మహ్మద్ ప్రవక్త మనుమలు పోరాడి ప్రాణ త్యాగానికి గుర్తుగా మొహర్రంను నిర్వహిస్తున్నట్లు ముస్లిం మత పెద్దలు తెలిపారు. పట్టణంలో శనివారం మొహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం రాత్రి గుండాలు వేసి, నిప్పుల్లో నడిచారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం ఉదయం వీధులలోని ముబారక్ సెంటర్, మార్కెట్ సెంటర్, బస్టాండ్‌ల మీదుగా పీర్లు ఊరేగింపు కొనసాగింది. మసీదుల్లో భక్తులకు షరబత్ పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.


అలీనఖీపాలెంలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ముస్లింలు


అలీనఖీపాలెంలో చెస్ట్ బీటింగ్ చేస్తున్న ముస్లింలు


పీర్ల ఊరేగింపులో పాల్గొన్న నిర్వాహకులు


గుడివాడలో పీర్లు ఊరేగిస్తున్న ముస్లింలు

క్లుప్తంగా

కలిదిండి పీఎస్‌లో డీఎస్పీ తనిఖీలు



కైకలూరు/కలిదిండి: వార్షిక రికార్డుల తనిఖీల్లో భాగంగా కలిదిండి పోలీసు స్టేషన్‌ను ఏలూరు డివిజన్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు శనివారం సందర్శించారు. స్థానిక ఎస్ఐ ఎస్.ప్రియకుమార్ రికార్డులను డీఎస్పీకి చూపించారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. స్టేషన్ పనితీరు, రికార్డుల నిర్వహణ సంతృప్తికరంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే యజమాని, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కైకలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్ పాల్గొన్నారు.

వర్షం బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ



గుడివాడటౌన్: స్థానిక దనియాలపేటలోని రజక కాలనీలో నీట మునిగిన ప్రాంత ప్రజలకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. తహసీల్దార్ కె.ఆంజనేయులు ఆధ్వర్యంలో సరుకులను ఆర్ఐ నాగబాబు అందించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను ఆధ్వర్యంలో 20 కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి మురళి, చుండూరి శేఖర్, కన్వీనర్లు పాపారావు, శ్రీనివాస్, రమీజా, వినయ్ పాల్గొన్నారు.

నేడు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు

పామర్రు: స్థానిక తమ్మా కోటమ్మ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజీలో సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలపై ఆదివారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మానవత రీజియన్ చైర్మన్ పీఎంఎస్ ప్రసాద్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఈ సదస్సులో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ టి.భాస్కర్‌రెడ్డి, జమీగొల్వేపల్లి పీహెచ్‌సీ వైద్యుడు టి.వరప్రసాద్‌లు పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు. అదే రోజు ఉదయం 8.30 నిమిషాలకు స్థానిక శివరామ సినీ కాంప్లెక్స్‌లోని ఎన్టీఆర్ స్టూడియోలో మానవత సమావేశం జరుగుతుందని, సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

నేడు యలమర్రులో నేత్ర వైద్యశిబిరం

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు గ్రామంలో ఆదివారం అమరావతి సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులచే ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అట్లూరి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షలు చేస్తామన్నారు. పరీక్షల అనంతరం కళ్లజోళ్ల పంపిణీతో పాటు కంటి ఆపరేషన్లు అవసరమైన వారికి విజయవాడలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని చెప్పారు. సమీప గ్రామాల ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మణిపూర్‌లో హింసాకాండను ఆపాలి



పామర్రు: మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండను ఆపాలని న్యాయవాది ఆవుల ప్రవీణ్‌కుమార్ కోరారు. స్థానిక శివరామ సినీ కాంప్లెక్స్‌లో దళిత జేఏసీ సభ్యుల సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు కారణమైన వారిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పామర్రు మండల పరిధి నిభానుపూడి గ్రామంలో బాలిక హత్యపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు కొడమంచిలి చంద్రశేఖర్, రాయవరపు సాల్మన్‌రాజు, జువ్వనపూడి సురేంద్రకుమార్, కొల్లూరి ఏసురత్నం, మనోహర్, ఏఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

120 మంది వృద్ధులకు కంటి పరీక్షలు

కంకిపాడు: కళ్లను నిర్లక్ష్యం చేయొద్దని ఉప్పలూరు పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ సూచించారు. కంకిపాడు -3 సచివాలయ పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో శనివారం డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. 120 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు చేసి అవసరమైన మందులు, పలువురికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతలను ఆదుకునేందుకు చర్యలు

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్


కొండిపర్రులో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

కొండిపర్రు(పామర్రు): తీవ్ర వర్షాలతో పంటలు నష్టపోయిన రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వారిని సత్వరమే ఆదుకునే విధంగా తగు చర్యలు తీసుకుంటామని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. మండల పరిధి కొండిపర్రు, రిమ్మనపూడి గ్రామాల్లో వర్షాల కారణంగా ముంపునకు గురైన వరి పంట పొలాలను ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖల అధికారులతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే మాట్లాడుతూ.. పంట పొలాల మునకకు కారణాలను తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొండిపర్రులో 450 ఎకరాలు, రిమ్మనపూడిలో 150 ఎకరాల వరకు నీటమునిగిందన్నారు. భవిష్యత్‌లో రైతులకు డ్రెయినేజీల సమస్యలు లేకుండా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ముమ్మనేని సత్యనారాయణరెడ్డి, నాయకులు గుజవర్తి కాంతారెడ్డి, ముమ్మనేని ఫణికుమార్, కుంపటి భాస్కరరావు, బొమ్మారెడ్డి కోటిరెడ్డి, కూసం శ్రీధర్‌రెడ్డి, ముమ్మనేని సురేష్‌రెడ్డి, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎంపీడీవో వై.రామకృష్ణ, ఇరిగేషన్, డ్రెయినేజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గుడివాడటౌన్: సాంకేతిక లోపాల వల్ల ప్రభుత్వ పథకాలు అందని ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అధికారులకు సూచించారు. స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో నియోజకవర్గానికి చెందిన పలు ప్రాంతాల ప్రజలు శనివారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. దీనిపై ఎమ్మెల్యే కొడాలి నాని అధికారులతో మాట్లాడుతూ సాంకేతిక లోపాలు గుర్తించి వాటి పరిష్కారానికి ఉన్నతాధికారులతో చర్చించాలన్నారు. ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందని, అవి ఏ కారణంచేతనూ లబ్ధిదారుడికి అందకుండా ఉండకూడదన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొడాలి నాని

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గుడివాడటౌన్: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని 3, 17వ వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. స్థానిక 3వ వార్డులోని 34వ సచివాలయంలో జరిగిన సురక్ష కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ పాల్గొని ప్రసంగించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు సర్వే నిర్వహించి, అవసరమైన వారికి 11 సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నామన్నారు. అనంతరం 43 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వీరిశెట్టి నరసింహరావు, నాయకులు దుడ్డు చిన్నా, ఇతర అధికారులు పాల్గొన్నారు. స్థానిక 17వ వార్డులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ టీవీ రంగారావు పాల్గొన్నారు. 731 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మాదాసు వెంకటలక్ష్మి, వార్డు ఇన్‌చార్జి దారం కాంచన, వార్డు కన్వీనర్లు రవికుమార్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.


సర్టిఫికెట్ అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తదితరులు

విద్యుత్ మీటర్లను ఇంటి బయట అమర్చాలి

కైకలూరు: విద్యుత్ మీటర్లను వినియోగదారులు ఇంటి, దుకాణం బయట ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్ శాఖ గుడివాడ ఈఈ టి.రామకృష్ణ చెప్పారు. కైకలూరు విద్యుత్‌శాఖ డీఈ కార్యాలయంలో మీటర్లపై సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు ప్రతి నెలా బిల్లులు పారదర్శకంగా ఇవ్వడానికి మీటర్లను స్కానింగ్ చేసి రీడింగ్‌లు నమోదు చేయిస్తున్నామన్నారు. కొంత మంది మీటర్లను షాపులు, ఇళ్ల లోపల అమర్చడం వల్ల నెలవారీ మీటర్ రీడింగ్ స్కానింగ్ చేయుటకు సాధ్యం కావడం లేదన్నారు. సిబ్బంది రీడింగ్ నమోదు చేసే సమయంలో వినియోగదారులు అందుబాటులో లేకుంటే తదుపరి బిల్లులో రెండు మూడు నెలలకు ఒకేసారి రీడింగ్ నమోదు చేయుట వలన బిల్లులో వ్యత్యాసం వచ్చే అవకాశం ఉందన్నారు. తాత్కాలికంగా విద్యుత్ వినియోగం లేనప్పటికీ మీటర్‌ను స్కానింగ్ చేసి బిల్లు ఇస్తామన్నారు. ఏదైనా కారణం చే స్కానింగ్ కాకుంటే, ఆ మీటర్లను ప్రత్యేక తనిఖీ అధికారులు పరిశీలిస్తారని పేర్కొన్నారు. ఎక్కువ కాలం వినియోగం లేకుంటే, సర్వీసును రద్దు చేసుకుని, తిరిగి అవసరమైనప్పుడు వెంటనే కొత్త సర్వీసును పొందే అవకాశం ఉందని తెలిపారు. దీని వలన వినియోగించని కాలానికి అనవసరంగా మినిమం చార్జీలు చెల్లించాల్సిన భారం ఉండదన్నారు. విద్యుత్ బిల్లు ఇచ్చిన 14 రోజులలోపు చెల్లించే వారికి అదనంగా ఎటువంటి సర్ చార్జీలు ఉండవన్నారు. 30 రోజుల్లోపు చెల్లించని సర్వీసులకు వెంటనే సరఫరా నిలిపివేస్తామన్నారు. 60 రోజుల తర్వాత మీటర్ తొలగించి, సర్వీసును శాశ్వతంగా రద్దు చేస్తామని చెప్పారు. వర్షాకాలంలో చెరువులపై విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా లేకుండా, 8 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసుకోవాలన్నారు. సరైన అవగాహన, నైపుణ్యం లేనివారితో విద్యుత్ పరికరాలను రిపేర్లు చేయించరాదన్నారు. కార్యక్రమంలో స్థానిక డీఈఈ రామయ్య, ఏఈలు శ్రీనివాసమూర్తి, నాగేశ్వరరావు ఉన్నారు.


సిబ్బందికి సూచనలిస్తున్న గుడివాడ ఈఈ రామకృష్ణ

రేపు కైకలూరులో జాబ్ మేళా

కైకలూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో కైకలూరు - ఏలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల వద్ద సోమవారం ఉదయం జాబ్ మేళా జరుగుతుందని విజ్ఞాన్ ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ, కరస్పాండెంట్ జి.రంగారావు శనివారం చెప్పారు. జాబ్‌మేళాలో 15 కంపెనీలు పాల్గొంటాయని, సుమారు 1,200 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బి.టెక్ విద్యార్హతతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఆకర్షణీయమైన జీతంతో ఉద్యోగాలు కల్పిస్తాయన్నారు. యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యతోనే బంగారు భవిష్యత్

ఘంటసాల(అవనిగడ్డ): విద్యతోనే ప్రతి ఒక్కరూ బంగారు భవిష్యత్‌ని ఏర్పాటు చేసుకోగలరని ఎస్ఐ కూచిపూడి శ్రీనివాస్ చెప్పారు. ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం ఎస్సీ బాలికల వసతి గృహంలో శనివారం విద్యార్థినులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థినులు గుర్తు తెలియని వ్యక్తులతో మాట్లాడటం, ఛాటింగ్‌లు చేయరాదని సూచించారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంటూ చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తల్లిదండ్రులు విద్యార్థినులను ఎప్పుడూ గమనిస్తూ ఉండాలని ప్రవర్తనలో ఏదైనా మార్పు వస్తే అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే వార్డెన్‌కు లేదంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. దిశ యాప్, డయల్ 100 పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తొలుత ఆయన వసతి గృహ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తెలుగురావుపాలెం సర్పంచ్ రాచూరి ప్రసాద్‌బాబు వసతి గృహ విద్యార్థినులకు పుస్తకాల కోసం రూ.2 వేలు నగదు అందించారు. గ్రామానికి చెందిన తుంగల సుగుణమ్మ వసతి గృహానికి మిక్సీని అందజేశారు. కార్యక్రమంలో వార్డెన్ పి.జ్ఞాన సుందరి, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం భువనేశ్వరి, పలువురు ప్రజాప్రతినిధులు, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.